సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 50 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం | 04.06.2025

# తెలంగాణ నేతన్నకు మరింత భరోసా

- రూ.48 కోట్లు కేటాయింపు
- వివరాలు వెల్లడించిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్, మన చౌరాస్తా :** నేత కార్మికుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులోభాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ చేనేత అభయహస్తంలో భాగంగా తెలంగాణ నేతన్నకు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్ రూ. 48 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా జియో ట్యాగ్ చేయబడిన మగ్గాలపై పనిచేస్తున్న కార్మికులకు మరియు అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకం కింద గరిష్టంగా సంవత్సరానికి నేత కార్మికులకు రూ.18,000 , అనుబంధ కార్మికులకు రూ. 6,000 అందించడం జరుగుతుందన్నారు. దీంతో దాదాపు 40,000 మంది చేనేత మరియు అనుబంధ కార్మికులు లబ్ధి పొందుతారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా తయారుచేయబడిన యూనిక్ లోగోను జతచేయడం జరుగుతుందని, తద్వారా చేనేత ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను మరియు నేత కార్మికుని వివరాలను వినియోగదారులు తెలుసుకోవచ్చు. దీంతో తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరిగే అవకాశాలు ఏర్పడతాయని మంత్రిగారు తెలియజేశారు. ఈ పథకం నేత మరియు అనుబంధ కార్మికులందరికీ వర్తిస్తుంది. 18 సంవత్సరాలు నిండి జియో ట్యాగ్ చేయబడిన మరమగ్గాలపై పనిచేసే కార్మికులు మరియు ప్రీలూమ్, ప్రిపరేటరి పనులైన డైయింగ్, టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండిరగ్, సైజింగ్ మొదలైన అనుబంధ పనులు చేసే కార్మికులు, చేనేత వృత్తి ద్వారా వారి వార్షిక ఆదాయంలో కనీసం 50 శాతం పొందుతున్నవారు అర్హులు. ఈ పథకం కింద జియో ట్యాగ్ చేయబడిన మగ్గాల ద్వారా వార్పులలో కనీసం 50 శాతం కంటే



ఎక్కువ పూర్తి చేసిన నేత మరియు అనుబంధ కార్మికులకు నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి వేతన ప్రోత్సాహకం కింద సంవత్సరానికి రెండు విడతలుగా ఏప్రిల్ నుండి సెప్టెంబర్ మరియు అక్టోబర్ నుండి మార్చి నేత కార్మికునికి రూ. 9,000, అనుబంధ కార్మికునికి రూ. 3,000 జమ చేయడం జరుగుతుంది. అయితే మొదటి విడతలో 50 శాతం వార్పులు పూర్తి చేయని వారు, రెండో విడతలో పూర్తి చేసినట్లతే మొత్తం ప్రోత్సాహకం సంవత్సరాంతంలో చేనేత మరియు అనుబంధ కార్మికులకు అందించబడుతుందని మంత్రి తెలిపారు.



## భూభారతితో భూసమస్యలు పరిష్కారం : కలెక్టర్

2 లో



3 లో

## గుడిసెవాసులపై వేధింపులు సరికాదు

wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు

- నిరసనగా నేడు జాగృతి మహాధర్నా

**హైదరాబాద్, మన చౌరాస్తా :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నోటీసులు ఇచ్చినందుకు నిరసనగా తెలంగాణ జాగృతి భారీ ధర్నాకు పిలుపునిచ్చింది. జూన్ 4న బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ మహాధర్నా ఇందిరా పార్క్ వద్ద జరగనుంది. ఈ ధర్నాను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వయంగా నేతృత్వం వహించనున్నారు. కేంద్ర సంస్థలు కేసీఆర్‌పై టార్గెట్ చేసినట్లు ఆరోపిస్తూ, ఇది రాజకీయ కుట్రగా అభివర్ణిస్తూ జాగృతి నిరసన కార్యక్రమాన్ని చేపట్టనుంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంబంధించి కేసీఆర్‌కు నోటీసులు రావడం, దానిపై తెలంగాణ భవనుల నుండి కార్యకర్తల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ మహాధర్నా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ మాజీ సీఎం ప్రతిష్టను దెబ్బతీయాలని జరుగుతున్న చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జాగృతి ఈ నిరసన చేపడుతోందని కవిత పేర్కొన్నారు. ఈ మహాధర్నాలో జాగృతి కార్యకర్తలు, తెలంగాణ సంస్కృతి సంఘాల ప్రతినిధులు, నాయకులు భారీగా పాల్గొనే అవకాశం ఉంది. అధికార సంస్థల నిర్ణయాలను ప్రశ్నించే స్థాయిలో ఇది కీలక కార్యక్రమంగా మారనుంది.







# భూభారతితో భూ సమస్యల పరిష్కారం

- రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ .

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టం వల్ల ప్రజల భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మంగళవారం జనగామ మండలం పెంబర్తి, లింగాలఘణపురం మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసమే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ఈ చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే తొలి విడత సదస్సులు విజయవంతంగా ముగిశాయని, నేటి నుండి జూన్ 20వ తేదీ వరకు రెండో విడత రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వెల్లడించారు. ఈ సదస్సులో కలెక్టర్ భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని స్పష్టం చేశారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్,



పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్‌బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ అధికారులు ప్రజల దరఖాస్తులను స్వీకరించి, వెంటనే రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మంజూరు పత్రాలు అందించాలి

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారలుకు 3 రోజుల్లోగా మంజూరు పత్రాలు అందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. 9వ తేదీ నుండి ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో ముగ్గు పోసిన ఫొటోలను తీసి అప్లోడ్ చేయాలన్నారు. జన శక్తి అభియాన్ సౌత్ జోన్ ఎంపిక అవడం జరిగిందని, 25 లక్షల గ్రాంట్ అవార్డు ద్వారా అందనున్నాయని, ప్రతి గ్రామంలో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టి 30 పనులు సిద్ధం చేసుకోవాలన్నారు. సన్నబియ్యం పై తహసీల్దార్ ప్రతి రోజు డీలర్లతో సమీక్షలు నిర్వహించి, షాపునకు బియ్యం అందించి లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, సంబంధిత అధికారులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత అంశాలైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. మండల స్థాయి మేస్త్రీలతో సమన్వయం చేసుకుంటూ నిర్మాణాలను ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**జనగామ, మన చౌరాస్తా :** అల్ప సంఖ్యాక వర్గాల వారు విదేశాలలో పైచదువుల నిమిత్తం ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం కింద ఉపకార వేతనాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు అందించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి.విక్రమ్ కుమార్ తెలిపారు. పైచదువుల నిమిత్తం ఇతర దేశాలకు వెళ్లే వారు దీనికి అర్హులుగా పేర్కొన్నారు. ఈ పథకం కింద అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి ఉపకార వేతనాలు కింద ఆర్థిక సాయం కోసం రూ.20 లక్షలు విమాన ప్రయాణ చార్జీలు రూ.60 వేలు చెల్లించనున్నట్టు తెలిపారు. మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థిని విద్యార్థుల వయస్సు 35 సంవత్సరంలకు మించరాదని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని, ఆధార్ కార్డుతో పాటు కమ్యూనిటీ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకొనుటకు www.telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ను సందర్శించాలని చివరి తేదీ జూన్ 30 గా పేర్కొన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని రెండు సెట్స్ దరఖాస్తులను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాల్సిందిగా తెలియజేశారు. ఇతర వివరాలకు 9951933034, 9059679793 నంబర్లను సంప్రదించాలన్నారు.




## ఘనంగా యోగా వాక్

**చిట్యాల, మన చౌరాస్తా :** అంతర్జాతీయ 11వ యోగ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆయుష్ డిపార్ట్మెంట్ చిట్యాల హోమియో డిస్పెన్సరీ ఆధ్వర్యంలో యోగవాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా చేయండి ఆరోగ్యంగా ఉండండి, ఆరోగ్యానికి మించిన ఆనందం ఏది లేదని నినాదాలు చేస్తే యోగ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోమియోధిస్తాను మెడికల్ ఆఫీసర్ తయ్యబా కౌసర్, సీనియర్ యోగ ఇన్‌స్ట్రక్టర్ భజరంగ్ ప్రసాద్, వైష్ణవి, ఫార్మసిస్ట్ సరిత, ఆశా వర్కర్లు జయమ్మ సైదమ్మ, శైలజ, గీత, రజిత, కవిత తదితరులు పాల్గొన్నారు.


## బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరం సహకారం అందించాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో బక్రీద్ పండగను పురస్కరించుకొని, డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి కలెక్టర్ శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోవధ నిషేధంగా పేర్కొన్నారు. గోమాతను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలి కానీ వివాదాలకు వెళ్లవద్దని సూచించారు. మాంసపు విక్రయాల వద్ద మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి రాధాకిషన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటుతాం

## మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్

**జనగామ, మన చౌరాస్తా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతామని జనగామ మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్ అన్నారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలో స్థానిక ఓం సాయి గార్డెన్స్ లో జరిగిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి అధ్యక్షత వహించగా శివరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నాయకత్వంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనగామలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ప్రజా పాలనలో పేద ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గంగం నరసింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజు గౌడ్, తరిగొప్పుల, నర్మెట్ట మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వగలబోయిన యాదగిరి గౌడ్, రాజబోయిన లక్ష్మీనారాయణ, ఏఎంసీ డైరెక్టర్లు బన్సీ నాయక్, నామాల శ్రీనివాస్, బుట్ రెడ్డి శ్రీలత రెడ్డి, మాజీ కౌన్సిలర్ గాదపాక రామచంద్రం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బడికే కృష్ణ స్వామి, ఆలేటి సిద్ధిరాములు, బక్క శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మసూద్, బాల్ సింగ్, తుపాకుల రాములు, ఎల్లయ్య, విద్యనాథ్, చెవుల పర్ష రాములు, బనుక ప్రభాకర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రకాష్ యాదవ్, అర్జున్ రెడ్డి, వీర్ల లక్ష్మణ్, గాజే అనిల్, వివిధ వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు మల్లారెడ్డి, మచ్చ ప్రవీణ్, పర్వతాలు, అజమ్, స్టాలిన్, వివిధ గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.







# గుడిసెవాసులపై వేధింపులు సరికాదు

- కలెక్టర్ తీరు మార్చుకోవాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** లింగాలఘణపురం మండలం పటేల్ గూడెం గ్రామ శివారులో ఉన్న గుడిసెవాసులపై రెవెన్యూ, పోలీసు అధికారులు వేధింపులు సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. వారి వేధింపులను నిరసిస్తూ మంగళవారం కలెక్టర్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు గంటల పాటు ఎర్రటి ఎండలో కూర్చున్న కలెక్టర్ స్పందించకపోవడంతో సరికాదన్నారు. గతంలో పని చేసిన కలెక్టర్లు ప్రజలకు సేవలు అందించి జనగామ ప్రజల మన్ననలు పొందారని, కానీ ప్రస్తుత కలెక్టర్ మాత్రం ప్రజలకు సమయం ఇవ్వకుండా అధికార పార్టీకి, భూ కబ్జాదారలకు వత్తాసు పలుకుతున్నాడని ఆరోపింరచారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనేకసార్లు గుడిసేవాసులకు పట్టాలు ఇచ్చేంతవరకు అండగా ఉంటానని హామీ ఇచ్చినప్పటికీ లింగాలఘణపురం రెవెన్యూ అధికారులు, పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ రాత్రి సమయాలలో గుడిసెల వద్దకు వెళ్లి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, జోగు ప్రకాష్, పొత్కనూరి ఉపేందర్, లింగాలఘణపురం మండల కార్యదర్శి బొడ్డు కర్ణాకర్, మండల కమిటీ సభ్యులు గోసంగి శంకరయ్య, తుటి దేవదానం, నాయకులు పల్లెర్ల లలిత, దేవరుప్పుల మండల కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి, రవి కుమార్, యాకన్న, శ్రీను పాల్గొన్నారు.








## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు న్యాయం జరుగుతోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పేదల జీవితాల్లో సుస్థిరత తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెండు రోజులు వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణలో రాగల రెండు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. బుధవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశాలున్నాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో జనగామ, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, వికారాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో తేలికపాలి వర్షాలు కురిశాయి. అత్యధికంగా జనగామ జిల్లా వడ్లకొండలో 1.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.




# శేఖర్ కమ్ములకు చిరు కానుక..

దర్శకుడు శేఖర్ కమ్ములపై చిరంజీవి ప్రశంసలు కురిపించారు. ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు. పెన్నును బహుమతిగా ఇచ్చారు. తాను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా శేఖర్ కమ్ముల ఇటీవల చిరంజీవిని కలిసిన విషయం తెలిసిందే. కలలను వెంటాడితే విజయం తప్పకుండా మనల్ని ఫాలో అవుతుందని నమ్మకం ఇచ్చిన వ్యక్తి చిరంజీవి అని.. తన 25 ఏళ్ల ప్రయాణాన్ని ఆయన సమక్షంలో చేసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆ ఫొటోలనే ఇప్పుడు చిరు షేర్ చేశారు. మీలాంటి అభిమానులు ఉండడం నాకూ ఆనందమే. మీ ప్రస్థానానికి నేను స్ఫూర్తినిచ్చానని తెలిసి మరింత సంతోషించాను. మీ 25 ఏళ్ల జర్నీలో నేనూ భాగమైనందుకు గర్వంగా ఉంది. సున్నితమైన వినోదంతో పాటు సందేశాన్ని జోడిస్తూ ఆలోచనాత్మకంగా తీసే మీ సినిమాలంటే నాకు ఎంతో ఇష్టం. ఫిల్మ్ మేకింగ్‌లో మీ కంటూ ప్రత్యేకతను క్రియేట్ చేసుకున్నారు. మీరు ఇలాగే మరో 25 ఏళ్లు జనరంజకమైన సినిమాలు తీస్తూ మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటున్నాను అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇక సినిమాల విషయానికొస్తే.. చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర'తో బిజీగా ఉన్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'కుబేర' విడుదలకు సిద్ధంగా ఉంది. ధనుష్, నాగార్జున ప్రధానపాత్రల్లో నటించిన ఈ చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## మాళవిక మోహన్‌పై నెటిజన్ల ట్రోల్



ఈ రోజుల్లో అందాల ముద్దుగుమ్మలు గ్లామర్ షో చేయడం మనం చూస్తూనే ఉన్నాం. సినిమా ఆఫర్స్ తగ్గిన సమయంలో నిత్యం అందాలు ఆరబోస్తూ రచ్చ చేస్తున్నారు. అయితే గ్లామర్ షో సమయంలో కొందరు దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఓ ముద్దుగుమ్మని దారుణంగా ట్రోల్ చేయడంతో ఆమె ఇచ్చిన సమాధానం అందరిని ఆశ్చర్యపరిచింది. నేను ఒక్క దానినే అందాలు ఆరబోయడం లేదు.. మిగతా హీరోయిన్స్ కూడా అదే చేస్తున్నారంటూ కామెంట్ చేసింది. ప్రస్తుతం ఈ అమ్మడి కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మలయాళం, తమిళం, తెలుగు చిత్రాల్లో నటిస్తూ తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మాళవిక మోహనన్ నెటిజన్ల ట్రోల్స్‌కు గట్టిగా సమాధానం ఇచ్చింది. 2011లో మలయాళ సినిమా ద్వారా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ మలయాళీ ముద్దుగుమ్మ ఇప్పటివరకు 60పైనే సినిమాల్లో కథానాయికగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించి పేరు తెచ్చుకుంది. ఇటీవల ఈ భామ నటించిన రెండు మలయాళ చిత్రాలు తంకమణి , వన్స్ అపాన్ ఏ -టైమ్ ఇన్ కొచ్చి విడుదలై మంచి గుర్తింపును తీసుకువచ్చాయి. వరుస సినిమా ఆఫర్స్‌తో ఫుల్ జోరులో ఉన్న ఈ ముద్దుగుమ్మ అందాల వడ్డింపులో ఏ మాత్రం కాంప్రమైజ్ కావడం లేదు. తరచు తన గ్లామర్ షోతో రచ్చ చేస్తూనే ఉంటు-ంది. అయితే దీనిపై కొందరు నెటిజన్స్ ట్రోల్ చేశారు. అవకాశాల కోసమే మాళవిక అలా తన బాడీ చూపించుకుంటుందని కొందరు కామెంట్స్ చేశారు. దీని గురించి తాజాగా స్పందించిన మాళవిక మోనన్.. నేను ఎప్పుడు కూడా ఛాన్స్‌ల కోసం గ్లామర్ షో చేయలేదు. అయిన అందాలు చూపించడంలో తప్పేంటి. మలయాళ చిత్రాలలో ఎక్స్‌పోజ్ చేసే ఛాన్స్ ఉండదు. తెలుగు, తమిళ భాషలలోనే అలా నటించవచ్చు. ముఖం చూపించకుండా సోషల్ మీడియాలో నా గురించి రాసే వారిని నేను పట్టించుకోను. అయిన నేను ఒక్క దానినే గ్లామర్ ఫొటోలు షేర్ చేయడం లేదు, చాలా మంది హీరోయిన్స్ అలానే చేస్తున్నారు అని పేర్కొంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## ప్రభాస్ అభిమానులకు ఇక పండగే

### 16న రాజాసాబ్ టీజర్ విడుదల

ప్రభాస్ అభిమానులకు ఇక పండగే. త్వరలోనే శుభవార్త అంటూ వార్తలు వస్తున్నాయి. కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' భారీ అంచనాల మధ్య రానున్నది. ఈ మూవీ అప్‌డేట్ గురించి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా నిర్మాణ సంస్థ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా టీజర్ జూన్ 16న రానున్నట్లు తెలిపింది. అలాగే డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను పంచుకుంది. ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దృష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన వీడియోలు, పోస్టర్‌లు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ దర్శకుడు మారుతీ పోస్ట్ పెట్టారు. 'మీ అందరకీ ప్రామిస్ చేసినట్లే మీరు కోరుకున్నట్లు- ప్రభాస్‌ను బిగ్‌స్క్రీన్‌పై చూస్తారు. ఆరోజు అభిమానులకు పండగే. మీలో జోష్ నింపేందుకు మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి' అని క్యాప్షన్ పెట్టారు. మారుతి - ప్రభాస్ కాంబోలో వస్తోన్న తొలి చిత్రమిది. తమన్ ఇప్పటికే ఈ సినిమాలో నాలుగు పాటలు పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. వైవిధ్యమైన థీమ్స్‌తో వీటిని డిజైన్ చేసినట్లు వెల్లడిరచారు.

